# ఉపక్రమణిక

ఓం శ్రీ సాయిరాం

సర్వదేవతాతీత స్వరూపులు భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి దివ్య శ్రీచరణాలకు అనంతకోటి ప్రణామాలు. తన అనంత కరుణను, అవ్యాజప్రేమను మానవాళిపై వర్షించడానికి భగవంతుడు ప్రతియుగంలోనూ అవతరిస్తూ ఉంటాడు. ఈ నిమిత్తమై పురుషోత్తముడు రామునిగా, కృష్ణునిగా, బుద్ధుడిగా, జీసెస్‌గా, మహమ్మదుగా, షిరిడి సాయినాధుడిగా నేడు భగవాన్ శ్రీసత్యసాయిగా అవతరించాడు.

పరిపూర్ణావతారమైన కృష్ణావతారంలో అచంచల విశ్వాసము, నిష్కల్మష ప్రేమ కలిగిన భక్తులకు తన అనుగ్రహం లభిస్తుందని చాటి చెప్పాడు. దివ్యమాత యశోదకు, గోపికలకు తన అల్లరి చేష్టలతో అలరిస్తూ తన అవతార రహస్యాన్ని ఎంత ప్రేమతో ప్రకటించాడో ఈ నృత్య రూపకం తెలియజేస్తుంది.

యశోద, తన పరిచారికలతో కృష్ణుని అన్వేషించే దృశ్యంతో ఈ నృత్య రూపకం ప్రారంభమవుతుంది. ఆమె ప్రేమ పిలుపుకు స్పందించి కృష్ణుడు ఆమె ఎదుట ప్రత్యక్షమౌతాడు. వారు శ్రీకృష్ణుని సర్వాంగ సుందరంగా అలంకరిస్తారు. కృష్ణుడు గోవులతో, గోపాలకులతో యమునకు బయలుదేరుతాడు. ఇంతలో గోపికలు వచ్చి, నందకుమారుడు నవనీతచోరునిగా మారాడని యశోదకు ఫిర్యాదు చేస్తారు. కృష్ణునిపై ఉన్న ప్రేమ చేత తమ యింటిలోనే వెన్న, పాలు, పెరుగు, జున్ను సమృద్ధిగా ఉన్నాయనీ, వాటి కోసం కృష్ణుడు దొంగ కావలసిన అవసరం లేదని వాదిస్తుంది. దీనికి ఆశ్చర్యపోయిన గోపికలు ఎంత తల్లివయినా ఇంత గారాబం పనికిరాదని నిజమేదో కృష్ణుణ్ణే అడిగి తెలుసుకోమంటారు. పసివాడని ఒకవేళ తప్పు చేస్తే మన్నించమని, కృష్ణునికి బుద్ధి చెపుతానని యశోద వారిని అనునయిస్తుంది. తప్పు చేసినా కృష్ణుణ్ణి దండించవద్దని ప్రేమగా చెప్పమని అంటారు గోపికలు. కృష్ణుని మనసు ఏవిధంగానూ గాయపరచకుండా ఈ విషయాన్ని ఎలా అడగాలా అని ఆలోచిస్తుంది యశోద. జాగ్రత్తగా ప్రణాళిక సిద్ధం చేసుకుంటుంది. ఆ సాయంకాలం కన్నయ్య తన స్నేహితులతో ఆడుకుంటూ ఉంటాడు. యశోద కన్నయ్యను పిలుస్తుంది. తన ఒడిలో చేర్చుకుంటుంది. మాతృత్వ మమతామాధుర్యాలు తొణికిసలాడే స్వరంతో జాగ్రత్తగా, నెమ్మదిగా గోపెమ్మలు చెప్పిన సంఘటన నిజమేనా అని గోముగా అడుగుతుంది. కృష్ణుడు నిశ్శబ్దం, నిద్ర నటిస్తూ

సమాధానం చెప్పదు. 'నీ పనులతో నాకు తలవంపులు తెచ్చావు, నిన్ను బంధించక, దండించక తప్పదు' అని చిరుకోపంతో యశోద చెప్తుంది. అప్పుడు కృష్ణుడు 'ఎవరో చెప్పిన మాటలు నమ్మావు, పసివాడనని ఎంచక ఎన్ని మాటలు అన్నావు' అని 'నీ కన్న కొడుకునైతే ఇన్ని మాటలు అనే దానివా' అని బాధ నటిస్తూ అడుగుతాడు. ఈ మాటకు తట్టుకోలేక యశోద అంత మాట అనవద్దని, తన ప్రాణం, తన సర్వస్వం కృష్ణుడేనని కన్నీరు పెట్టుకుంది. కృష్ణుడు తల్లి కన్నీరు తుడిచి, పసివాడనని, తెలియక అన్నానని, మన్నేదో, వెన్నేదో తెలియనివాడినని, మన్నించమని అడుగుతాడు. యశోద ఊరడిల్లిన తరువాత, గోపికలు చెప్పింది నిజమేనని, తాను నిజంగా నవనీతచోరుణ్ణేనని ఒప్పుకుంటాడు. కన్నయ్యా! ఇది తప్పు కాదా! అని అడుగుతుంది యశోద. తన దివ్య అవతార తత్వాన్ని అప్పుడు శ్రీకృష్ణుడు ప్రకటిస్తాడు. అమ్మా! కాళీయుని మర్దించి, గోవర్ధనగిరినెత్తి, రాక్షసులను మట్టు పెట్టి, గోకులాన్ని, గోపికల్ని కాపాడలేదా ఈ నందగోకులమంతా నాదేనమ్మా, ఈ బృందావన గోపికలు నావాళ్ళేనమ్మా. నేను దొంగను కాదమ్మా దొరను, నేను వెన్నదొంగను కానమ్మా వెన్న మనసులను దొంగిలించాను, పాలు దొంగిలించలేదు వారి విన్నపాలనందుకున్నాను అంటాడు కృష్ణుడు. యుగయుగాలనుండి తాను ప్రేమ పంచి ఇవ్వడానికే అవతరిస్తానని, కలియుగంలో యమునయే చిత్రావతిగా, గోకులమే పుట్టపర్తిగా, గోపీగోపాలురే భక్తబృందంగా, జగములనేలే జగన్నాథుడు తానే ప్రేమామృతమూర్తి శ్రీసత్యసాయిగా అవతరిస్తానని చెప్పడంతో యశోద, గోపికలు స్వామి వైభవాన్ని కీర్తిస్తూ నృత్యం చేస్తుండగా నృత్య రూపకం ముగుస్తుంది. జై సాయిరాం...

# కృష్ణం వందే జగద్గురుం

శ్లోకం : కృష్ణం నంద నంద బాలకృష్ణం
కృష్ణం నందగోకుల బాలకృష్ణం
కృష్ణం విశ్వమోహన బాలకృష్ణం
కృష్ణం విశ్వనందిత సాయికృష్ణం

పాట : నందకుమారం కృష్ణంభజే
నవనీతచోరం కృష్ణంభజే
నటవర నాగర కృష్ణంభజే
నగధరసుందర కృష్ణంభజే
నారాయణ హరి కృష్ణంభజే
సాయి నారాయణ హరి కృష్ణంభజే ॥నందకుమారం॥

యశోద : చిన్నికృష్ణా మురళీధరా
గానలోలా కనుపించరా
కన్నతండ్రి నా చెంతకు కరుణతో రారా...
మోహనకృష్ణా మనమోహన కృష్ణా ॥చిన్ని॥
మేనంతా కనులు చేసి బృందావన వాటికలో
తిరిగి తిరిగి చూచినాను విసిగి వేసారినాను
కరుణించగ రావయ్యా కృష్ణయ్యా
కనుపించగ రావయ్యా కన్నయ్యా ॥చిన్ని॥

(కృష్ణుడు యశోదకు కనిపిస్తాడు. యశోద పరిచారికలు కృష్ణుని ఎట్టకేలకు పట్టుకుని సింగారించటానికి పూనుకుంటారు)

ఈ దినమెంతో శుభదినమౌగా
ఈ దినమెంతో సంతసమౌగా

1. సుకుమారుడు మన చిన్న కృష్ణుడు దొరికెనుగా
సంపంగి తలనూనె అలంది
జవ్వాది నలుగులు పూసి
చల్లని పన్నీట బాబుకు జలకములాడించేమా ॥ఈ దిన॥

2. మాణిక్యమ్ములు మౌక్తికములు
బంగారమునే పూసి
మిలమిల మెరిసే మయూర పింఛమును
శిరమున బాగుగ సింగారించి
మంగళాంగుడౌ చిన్నికృష్ణుని
మరి మరి చూచి మురియుదమా ॥ఈ దిన॥

(సింగారించిన శ్రీకృష్ణుడు గోపాలురతో బయలుదేరుటకు సిద్ధమౌతుండగా గోపాలకుల ప్రవేశం)

గోపాలకులు: గోపాలకృష్ణయ్యా రావయ్యా మీ
గోవులన్ని తోలుకుని రావయ్యా ॥గోపాలా॥

1. ముల్లుకర్ర పట్టుకుని–చద్దిమూట అందుకుని
గొంగళిని కప్పుకుని – నెమలి ఈక పెట్టుకుని
మురళి చేత పట్టుకుని – ముద్దుగాను పాడుకుంటు
బృందావన సీమలో – ఆటలాడుకుందాము ॥గోపాలా॥

2. గోరుముద్ద తినిపించి – గోరింట పెడతాము
దొంగిలించి తెచ్చిపెట్టి – వెన్నముద్ద తినిపిస్తాం
చందమామలా వెలిగే – అందమైన నీ మోమును
యమునలోన స్నానమాడి – తనివితీర చూసేస్తాం ॥గోపాలా॥

(కృష్ణుడు, గోపాలురు నిష్క్రమిస్తారు. రేపల్లెలో యశోద ఇంట గోపికలు కోపంతో ప్రవేశిస్తారు)

గోపికలు: నల్లని కృష్ణుడు ఏడమ్మా – మీ అల్లరి కృష్ణుడు ఏడమ్మా
కల్లలు పలికే గొల్లపిల్లలతొ – అల్లరి చేసే బాలకృష్ణుడు

యశోద: కల్లా కపటంతెలియని వాడు
అల్లరి ఎరుగని అతి సుకుమారుడు
వెన్నేదోమన్నేదో తెలియని వెర్రినాగన్న కృష్ణయ్య
ఏమిచేసెనమ్మ మీకీ కోపమెందుకమ్మా

గోపికలు: అమ్మవంటి నీవమ్మా అందాలబొమ్మా ఓ యశోదమ్మా
కల్లాకపటమెరుగని పసివాడా కన్నయ్య?
మన్నేదో వెన్నేదో తెలియనివాడా!
నందకిశోరుని నవనీతచోరుని
ఎన్నడైన అడిగావా ఓ యశోదమ్మా
మా ఇంటను దోచినట్టి వెన్న ఎలా మెక్కేడో
మా దుత్తను దాచినట్టి పాలు ఎలా తాగాడో
అదిలించి అడగవమ్మా ఆగడాలు తెలియునమ్మా

యశోద: పాలు వెన్న మీగడలకు కరువా మా ఇంటిలోన
కన్నతల్లి ఆదరణకు కొదువా మాఇంటిలోన
మీఇంటి పాలుపెరుగు కావలెనా కన్నయ్యకు

గోపికలు: ఆ..అలాగా!
ఎంత గొప్ప తల్లి ప్రేమ విన్నారా! కన్నారా!
ఊహకందనట్టి వింత సుంతైనా లేదు చింత
చిన్నవాడు తప్పుచేయ చక్కదిద్ద పనిలేదా
కంఠశోష తప్ప మాగోడు వినగ పనిలేదా ॥ఎంత గొప్ప॥

యశోద: అమ్మలార అక్కలార నా మాట విన్నారమ్మా
కన్నకొడుకు అయినగాని తప్పుచేయ ఒప్పుకోను
మాట అడిగి మందలించి బుద్ధిగరుపుతానమ్మా
పెద్దమనసుతో మీరు మన్నించగ రారమ్మా

గోపికలు: మన్నింపులు మనకేల మనమంతా ఒకటేకద
తప్పు తెలుసుకొంటివమ్మ ఈమాత్రం చాలునమ్మ
కోపగించి పసివాడిని బంధింపకుమమ్మా
కసుగాయ కన్నయ్యను దండించకు ఓయమ్మా
(కృష్ణుని మురళీగానంతో ప్రకృతి అంతా పులకిస్తూ నాట్యం చేస్తుంది)

గోపాలురు: గోపాలకృష్ణా రావయ్యా ఆటలాడుకుందాము రావయ్యా
వెన్నజున్ను తిందాము రావయ్యా పాలు పెరుగు తాగుదాము రావయ్యా

1. గోవులను తోలుకుని యమునకు పోయామని
గోధూళి వేళ కాని తిరిగి పల్లె చేరమని
పల్లెలో గోపికలు ఆదమరచి ఉన్నవేళ
వెన్న జున్ను దొంగిలించి తిందాము రావయ్యా ॥గోపాలా॥

2. సద్దులేక కన్నుకప్పి ఇంటింటా దూరి మనము
ఉట్టిమీద దుత్తలన్నీ అందంగా పగులగొట్టి
నోటిమీద మరకలేక వెన్న ఎలా మెక్కాలో
నటనసూత్రధారివి నీవే ఇక చెప్పవయ్యా ॥గోపాలా॥
(అందరూ ఆనందంగా నృత్యం చేస్తున్న సమయంలో యశోద పిలుపు వినిపిస్తుంది)

యశోద: కృష్ణా..బాల కృష్ణా... కృష్ణా...ముద్దు కృష్ణా...
రావయ్యా కృష్ణయ్యా నంద కుమారా
ఈ అమ్మ ఒడిలోన హాయిగ నిదురించరా.... ॥కృష్ణా॥

కృష్ణుడు: ఆటలాడుకునేవేళ ఎందుకు పిలిచావమ్మా
అందమైన చెక్కిలిపై ముద్దునీయనా
మా అమ్మ ఒడిలోన ఉయ్యాలలూగనా
ఆనందం పండగా హాయిగా నిదురించనా

యశోద: ఆటలాడి వచ్చావు అలసిపోయి ఉన్నావు

ఆదమరచి కొంతసేపు విశ్రమించరా

కమ్మనైన కథలెన్నో చెపుతాను వినరా

అమ్మమాట వినరా రాచబాట కనరా ॥కృష్ణా॥

జో...జో..బాలకృష్ణా జో.. జో.. ముద్దుకృష్ణా...

2. వెన్నదొంగిలించితివట నిజమేనా

పాలు పెరుగు తాగితివట నిజమేనా

అల్లరెంతో చేసితివట నిజమేనా

ఈ గోపెమ్మల మాటలన్ని నిజమేనా

(సంగీతం వినిపిస్తూ ఉంటుంది – కృష్ణుడు నిద్ర నటిస్తూంటాడు)

3. ఉలుకూ పలుకూ లేక ఏల ఊరుకున్నావు

తగవులెన్నొ తెచ్చావు తలవంపులు చేశావు

బంధించక తప్పదయ్య అల్లరికృష్ణా

నిన్ను దండించక తప్పదయ్య అల్లరికృష్ణా

(కృష్ణుడు కోపం నటిస్తూ దూరంగా పోయి)

కృష్ణుడు: గోపెమ్మలు చెప్పినట్టి కల్లలన్ని నమ్మావు

చిన్నవాడినని ఎంచక ఎన్నిమాటలన్నావు

నీ కన్న కొడుకునైన ఇన్నిమాటలందువా

ఎవరో చెప్పిన మాటలు ఈతీరున విందువా

అమ్మా యశోదమ్మా

పెంచిన మమకారమైన చూపించవేమమ్మా

(యశోద మనసుని బాణంలా ఈ మాట తాకుతుంది)

యశోద: అంతమాట అనకయ్యా అమ్మ మనసు తాళలేదు

నా కన్న కడుపు నీవుకన్నయ్యా నా రతనాల రాశి నీవు కన్నయ్యా

నా ముత్యాల మూట నీవు కన్నయ్యా

నా ప్రాణం నా సర్వం నీవేనయ్యా

కృష్ణా! బాలకృష్ణా!
ఇంకెవ్వరేమి చెప్పినా వినబోనయ్యా
కృష్ణా! బాలకృష్ణా!
(యశోద దు:ఖిస్తుంది. కృష్ణుడు దగ్గర చేరి ఓదారుస్తాడు)

కృష్ణుడు: కన్నీరు నించకమ్మా నా కన్నతల్లీ
నీ కన్నీరు చూడలేను చల్లని తల్లీ
పసివాడనమ్మ తెలియక నేనంటినమ్మ
వెన్నేదో మన్నేదో తెలియని వాడను తల్లీ
మన్నించవమ్మా మా యశోదమ్మా

2. వెన్న దొంగిలించినాను నిజమేనమ్మా
పాలు పెరుగు త్రాగినాను నిజమేనమ్మా
అల్లరెంతో చేసినాను నిజమేనమ్మా
ఈ గోపెమ్మల మాటలన్నీ నిజమేనమ్మా

యశోద: చిన్ని నా కన్నయ్యా తప్పుకాదా
నందకుమారుడవు నీవు వ్రేపల్లెకు రారాజువు
నవనీతచోరుడవు ఎందుకైనావయ్యా
చిన్ని నాకన్నాయ్యా తప్పుకాదా

కృష్ణుడు: అమ్మా యశోదమ్మా.... అమ్మా యశోదమ్మా....
కాళీయు మర్దించి కాపాడలేదా
గోవర్ధనమెత్తి వీరి కావగలేదా
రాక్షసుల మట్టు పెట్టి రక్షించలేదా
ఈ బృందావన గోపికలు నావారమ్మా
ఈ నందగోకులమ్మంతా నాదేనమ్మా
అమ్మా యశోదమ్మా
వెన్న దొంగిలించలేదు వెన్నమనసు దోచినాను
పాలుతాగ పోలేదు విన్నపాలనందుకొంటి

ప్రేమమూర్తినమ్మా నా ప్రేమ సుధను పంచినాను
దొంగను నే కానమ్మా దొరనేనమ్మా
ప్రతి యుగమును పుట్టినాను
ప్రేమ పంచి ఇచ్చినాను
కలియుగమున దివ్యప్రేమ పంచి ఈయగా
మన యమునే మారునమ్మ చిత్రావతిగా
గోకులమ్మె రూపుదాల్చు పుట్టపర్తిగా
గోపాలురు గోపెమ్మలు భక్తులై సేవింపగ
జగములెల్ల రక్షించే జగన్నాధుడను నేను
అవతరింతు ఈ భువిపై సత్యసాయిగా

యశోద, గోపికలు గోపాలురు |
గోపాల బాలసాయి – గోకుల లీల సాయి
భక్తులపై ప్రేమ సాయి – భక్త రక్షక సాయి ।।గోపాలబాల।।

1. పుట్టపర్తి నిలయసాయి – భక్తపూజిత సాయి
దేవ దేవ దేవ సాయి – దీన రక్షక సత్యసాయి ।।గోపాలబాల।।

2. అద్భుత మహిమల సాయి – ఆనందలోల సాయి
ఆర్త జనావన సాయి – అమర వంద్య సత్య సాయి ।।గోపాలబాల।।

అందరు: రావా స్వామీ సాయిబాబా
బ్రోచుటకు మముగాచుటకు
వేడితి నిను పాడితి, కొనియాడితి – మము బ్రోవరా ।।రావా।।

::0::

జై సాయిరాం